# కల - నిజం

జనాన్ని తప్పుకుంటూ, తొలగనెట్టుకుంటూ, గౌరిగాడు గేటు దాటి బయటికి వచ్చాడు. పిండారబోసినట్టుగా తెల్లని వెలుగును వెదజల్లే ఎలక్ట్రిక్ లైట్లు వెనకా, సోలుపుగా రోడ్డు మీద.... అంతా గౌరిగాడికి అదో తెలియని తీయని కొత్త ప్రపంచంలోకి జొరబడుతున్నట్టుగా తోచింది.

సినిమాలో కథానాయకుడు, కథానాయకి పాడిన ఆ పాటల్లోని ఏ ఒక్క చరణమూ సొంతంగా గొంతుకు పట్టకపోయినా – మొత్తం కథలోని ప్రేమ శృంగార రసాలు, ఆ ఘట్టాలూ నిండుగా అతడి వంటికి తైలమర్దనంలా పట్టుకుని యింకిపోయినై.

సినిమా కథానాయకుడిలానే గౌరిగాడికీ ఏదో తెలియని బాధా, మదిలో కళ్ళు తెరుస్తూన్న కలవరం, గురివింద తీగల్లా అన్ని వైపుల నుంచీ గుబురుకున్నాయ్.

రోడ్డుకు ఓ ప్రక్కగా కాళ్ళీడ్చుకుంటూ నడిచే గౌరిగాడు, మనస్సును ఊహా ప్రపంచంలోకి పరిగెత్తించాడు.

కథానాయకి సుగంధిని నిజంగా రాజు కూతురులానే అందమైంది. తను కట్టుకోబోతున్న పుల్లాం – ఆ మాటకొస్తే ఫాదరీ కూతురు ఎంజలమ్మ కూడా, ఆ అందం ముందు పొగచూరిన కట్టెపేడుల్లా కనబడతారు. అయినా అంత అందంగల రాజు కూతురు – తండ్రి దగ్గిర బంట్రోతుగిరి చేసేవాడి కొడుకును ప్రేమించడం....

అతడు నిలబడ్డాడు. రోడ్డు ప్రక్కన చింతచెట్టు కింద వదిలి వచ్చిన బండి వంక చూశాడు. గుండెలు గతుక్కుమన్నయ్. మోకాళ్ళల్లో పట్టు సడలినట్టయింది. చింతచెట్టు గుబురు కొమ్మల కింది పల్చని చీకటిలో తన యజమాని ఎడ్లను అదిలిస్తున్నాడు.

గౌరిగాడు గబగబ నడిచాడు. సినిమాలోని రాజు కూతురు అతని మనోకాశంలోని మబ్బుల చాటుకు మాయమైంది.

"ఏఁరా! వొళ్లు బలిసిందా! ఇప్పుడు దాకా ఏం చేస్తున్నావ్?"

గౌరిగాడు గజగజ లాడాడు. యజమాని సీతయ్య చేతిలో చర్నాకోలు కోసం, కళ్ళు కుంచించి చూశాడు.

"వెధవాయికి సినిమా చూసి మతిచెడింది కామాలు!"

శాంత నవ్వుతూనే అని – మళ్ళీ ఫక్కున నవ్వింది. తల్లి సూరమ్మ కూడా వంత నవ్వింది. ఒక్క సీతయ్య మాత్రం నవ్వకుండా గట్టిగా గదమాయించాడు.

"బండి కట్టు! ఊఁ! తొందరగా"

గౌరిగాడు తలవంచుకునే ఎడ్లను కాడి కిందకు లాగాడు. అవి రాక మొరాయించినై.

"ఓరి గాడిదా! ఎలపటా దాపటా కూడా మరచిపోయావ్!" – సీతయ్య పళ్లు కొరికాడు.

శాంత మళ్ళీ ఫక్కున నవ్వింది. తల్లి సూరమ్మ మాత్రం చూస్తూ వూరుకున్నది.

గౌరిగాడు తొట్లో కూర్చుని బండి తోలుతున్నాడు. శాంతా, సూరమ్మా, సీతయ్యా వెనక జల్లలో సవారి కింద కూర్చుని మాట్లాడుకొంటున్నారు. శాంత మధ్య మధ్య నవ్వుతూనే వుంది.

ఎడ్లు అదిలించకుండా వేగంగా నడుస్తున్నయ్. గౌరిగాడికి – శాంత మధ్య మధ్య నవ్వినప్పుడల్లా, శరీరం కుదిలించినట్టవుతోంది. ఆ నవ్వు అచ్చుగా సినిమాలో రాజు కూతురు నవ్వులాగే వుంది.

చవితినాటి చంద్రుడు ఆకాశంలో మేఘాల మీదగా – కిందగా పరవళ్లు తీస్తున్నాడు. ఎలక్ట్రిక్ దీపాలూ, రణగొణ ధ్వనులూ లేని పల్లెటూరి రోడ్డు మీదుగా బండి కదుల్తూ కదులుతోంది. రోడ్డుకు యిరువైపులా వున్న తుమ్మచెట్ల మీంచి విరగపూసిన తుమ్మపువ్వుల మదపు వాసన గౌరిగాడి నాసికారంధ్రాలను తాకి శరీరాన్ని వుడికెత్తిస్తోంది. నూగుమీసాల మీద అరిచేతిని రుద్దుకుని ఎడ్లను గట్టిగా అదిలించి తిరిగి ఊహాలోకాల్లోకి ఎగబాకాడు.

ఆ మరుసటి రాత్రి సగం నూర్చిన కుప్ప పక్కన, తడీపొడీగా వున్న నూర్పిడి గడ్డిలో వెల్లకిలా పడుకుని, గౌరిగాడు ఆకాశంలోకి చూస్తూ, తిరిగి సినీమా చూడసాగాడు.

ఒక్కొక్క దృశ్యమే అతడి కళ్ల ముందు, పంచమినాటి చంద్రుడి కాంతిలో కదిలింది...

"ప్రేమకు బీదా – పేదా, తేడా లేదు"

"మా నాయన దగ్గిర నౌకరీ చేసేవాడి కొడుకువైతే మాత్రమేం! నీ సాహసం... ధైర్యం...." రాజు కూతురు పక్కకు తలతిప్పి గుబురుగావున్న తెల్లని పువ్వుల చాటున ఫక్కున నవ్వింది.

గౌరిగాడు అదిరిపడి లేచాడు. అతడి నరనరాలూ సాగనార తాడులా కరుకెక్కినై. నూనూగు మీసాలు నాగుజెముడు ముళ్ళలా నిటారుగా నిలబడి పదునెక్కినై.

"ఆ నవ్వు! ఆ నవ్వు!"

గౌరిగాడు అరిచాడు. వెలుగును చూచిన ఖైదీలా, పరమ సత్యాన్ని కనుగొన్న తపస్విలా, ఆనందంతో గొంతెత్తి పాడాడు. ఆ పాటకు ఎండిన వరిదుబ్బుల్లోనుంచి నాము పిలకలు పుట్టి బయటికి తొంగి చూసినై. చేలగట్లూ, నెర్రుల్లో దాక్కున్న బుర్రిపిట్టలూ, కలుగుల్లోని తాచుపాములూ, పెరిగి, రెక్కలు విదిలించుకుని మెలికలు తిరిగినై.

గౌరిగాడు ఆకాశంలోని చంద్రుడి వంక చూస్తూ, ఊరి వైపుకు గొంతెత్తి పాడాడు. ఆ పాట సీతయ్య నడవా యింటి సీనారేకు గొట్టాల గుండా శాంత గదిలోకి ప్రవేశించి ఆమెను వుక్కిరి బిక్కిరి చేసి ఫక్కున నవ్విస్తుందని అతడి ఆశ.

తెల్లవారింది. నూర్పిడి జోరుగా సాగుతోంది. గౌరిగాడు బంతి తిప్పుతున్నాడు. ఎడ్లు, ఆవులతోపాటు, అతడూ శరీరాన్ని గానుగ ఎద్దులా కుప్పగడ్డిలో తిప్పుతున్నాడు. మనస్సు మాత్రం తన యజమాని కూతురు శాంత వోణిలోని అన్ని మడతల్లో, పొరల్లో గిర్రున తిరుగుతూ కితకితలు పెడుతోంది.

"ఈ గాడిదకు మతిపోయింది!"

శీతయ్య పెద్దగా అరుస్తున్నాడు. గౌరిగాడు వులిక్కిపడి వెనక్కి తిరిగి చూశాడు. బంతి గొడ్లన్నీ ఓ చుట్టు తిరిగి అతడి వీపు వెనుకకు వచ్చి ఆగివున్నయ్.

తిరిగి శరీరాన్ని పనికి వప్పచెప్పి, మనస్సును వూహావాయువుల మీదుగా వూళ్ళోకి నడపి,

సుడిగాలిలా శాంతను చుట్టుముట్టాడు.

సూర్యుడు తల మధ్య కెక్కాడు. పనివాళ్ళంతా ఎవరి అన్నం మూటలు వాళ్ళు విప్పుకుని భోజనాలకు తలపడ్డారు. సీతయ్య రుసరుసలాడుతూ అన్నాడు –

"గౌరిగా! తొందరగా కూడు తిని రావాలి. ఈ పనైన తరువాత నీ మత్తుకు మందేస్తాను!"

గౌరిగాడు తల వంచుకుని వూళ్లోకి బయలుదేరాడు. అతణ్ణి ఒకేఒక సంశయం నరాల్లో కెక్కిన యీత ముల్లులా బాధిస్తోంది – 'పెళ్ళి విషయం సీతయ్యను అడగడమా? శాంతను అడగడమా?'

ఆ కాల్చే ఎండలో చేల గట్లంట నడుస్తూ, మగత నిద్దరలో వున్నవాడిలా, మధ్య మధ్య భూతావేశం కలిగిన వాడిలా, అటూ ఇటూ గట్ల మీదా జారుతూ, సినిమా కథానాయకుడి మాటల్నీ, చేష్టల్నీ మననం చేయసాగాడు.

'సాహసే లక్ష్మీ!"

అవును! దేనికైనా సాహసించాలి! సినిమా కథానాయకుడు చేత్తో తాచుపామును పట్టాడు! తను కిర్రుచెప్పుల కాలితో దాని పడగను తొక్కిపట్టి చంపాడు. రాజు కూతురికి, ఆ కథానాయకుడికీ వున్న స్నేహాని కన్నా, తన స్నేహం శాంతతో మరీ చిన్నప్పటి నుంచి ప్రారంభ మైంది. తను వూహ తెలిసినప్పటినుంచీ సీతయ్య ఇంట్లో జీతం చేస్తున్నాడు.

ముళ్ళనే భయం ఏమీ లేకుండా, తను ఆ చిన్నతనంలో ఎన్నిసార్లు శాంతకు రేగికాయలు కోసి పెట్టలేదు! ముంజకాయలు కావాలంటే – కాళ్ళకు బంధమైనా లేకుండా ఎన్నిమార్లు తను అంతంత తాడిచెట్లు ఎక్కలేదు!!

తన పెళ్ళి పుల్లాంతో జరగటం అసంభవం. చింపిరి పేలికలతో, మడ్డి మొహంతో, జీబిరిజుట్టుతో, పేడతట్ట నెత్తిన పెట్టుకొని వస్తుంటే – ఆ రోజుల్లో ఎలా వున్నా ఇప్పుడు తలుచుకుంటేనే నేపాళం మాత్ర వేసుకున్నట్టుగా అవుతోంది.

'సీతయ్య ఆ రాజులాగానే డబ్బు సంపాయించమంటాడా?' – గౌరిగాడి ముందు హఠాత్తుగా ఈ ప్రశ్న తాచుపాములా ఎగిరి నిలబడింది.

విష్ణాలయం పక్క పాడుపడిన బావిలో లంకిణీ బిందెలు వున్నమాట నిజమేగదా! దానయ్యా, చలమయ్యా వాటి కోసం ప్రయత్నించి నెత్తురు కక్కి చచ్చారు. కాని…తను… సాహసించి శాంత కోసం తెగించి వాటిని బయటకు తేలేడా?

గౌరిగాడి గుండెల్లో భయం ఎద్దుకొమ్ములా మొనతేలింది.

తను విన్న దయ్యాల కథలు, ఫాదరీ చెప్పే సైతాన్ చరిత్ర – అంతా అతడి కాళ్ళనూ, హృదయాన్నీ జెర్రిపోతులా మెలివేసుకుని ఛెళ్ళు ఛెళ్ళుమని తోకతో చరుస్తోంది.

సినిమా కథ మళ్ళీ అతడి కళ్ళ ముందూ, పక్కల్నా కదుల్లాడింది….సాహసం చేయాలి ….ప్రేమ కోసం….

తల వంచుకునే వూళ్ళోకి ప్రవేశించాడు. నడుం వంచుకొని చావిట్లోకి జొరపడ్డాడు. నల్లగా మాడు కట్టిన మల్లని ఏవగింపుగా చేతిలోకి తీసుకుని పెద్దగా అరిచాడు –

"శాంతమ్మా! శాంతమ్మా!"

"ఏంరా! మతిబోయిందా? అరుస్తావెందుకు?" సూరమ్మ కూకలేస్తూ బయటకు వచ్చింది.

"తొందరగా వెళ్ళాలి! బువ్వ...."

"ఛోవే! వాడికి అన్నం పెట్టి త్వరగా పంపు"

గౌరిగాడు గాటికి ఆనుకు కూర్చున్నాడు. 'సాహసం! సాహసం!' ఆ మాటలు జోరీగల్లా అతడి చెవి చుట్టూ తిరగసాగినై. నిర్ణయించుకున్నాడు.

శాంత అన్నం పెట్టి, "సినిమా చూసినప్పటి నుంచీ మతిచెడిందా?" అని ఫక్కున నవ్వింది.

గౌరిగాడి మదిలో ఏదో తెలియని బాధా, కళ్ళు తెరుస్తూన్న కలవరం, గురివింద తీగల్లా అన్నివైపుల నుంచీ గుబురుకున్నయ్.

శాంతకు జవాబు చెప్పేందుకు, అలాంటి ఘట్టంలో సినీమా కథానాయకుడు ఏమన్నాడో, ఆ మాటలు గుర్తుచేసుకునేందుకు ప్రయత్నించాడు. కానీ ఏ గుర్తూ అతడి మనస్సు, గొంతుకు అందించలేకపోయింది.

సాధారణంగా – అతి సాధారణంగా, ఎడమ కన్ను కొట్టి, కుడికాలుతో మల్లను పక్కకు తోసి, రెండు చేతుల్నీ ముందుకు చాపి లేచి నుంచుని, శాంత వైపుకు నడిచేందుకు ఉపక్రమించాడు.

"తొందరగా రావే! పాలు పొంగిన వాసన వస్తోంది"

శాంత యింట్లోకి పరిగెత్తింది. పరిగెత్తే ముందు ఆ అమ్మాయిలో ఏ వుద్రేకాలూ, వుద్వేగాలూ కలిగినయ్యో కాని – బిగువుగానే వున్న ఛోళీ పిగలలేదు. పమిట జారలేదు.

❀ ❀ ❀

ఆ రాత్రి సగం తయారైన కడిం మీద వెల్లకిలా పడుకుని అష్టమినాటి చంద్రుణ్ణి చూస్తూ గౌరిగాడు పాడేందుకు గొంతు సవరించబోయాడు.

"అరే గౌరిగా!" పెద్ద కేక.

"ఏమిటి దొరా!" – బెదురుగా, చెదిరిన మనస్సులోనుంచి జవాబు.

"నువ్వు మధ్యాన్నం చేసిన పని...."

ఠక్కున సినిమా మాటలు గౌరిగాడి గొంతు చించుకుని బయటపడినై....

"నిజమే చెప్ప....."

అతడి మాట పూర్తి కాకుండానే – నల్లగా చావతేలిన నున్నటి సంద్రకర్ర కత్తవ అతడి మెడ మీద పడింది.

గింజ రాలి కలగావులగంగా నలిగిన ఆ ఎండు వరిగడ్డిలో కొద్దిపాటి గలగల గిలగిల!

భగ్గున అంటుకుని ఆకాశం వైపుకు నాలుకలు చాచిన ఆ ఎర్రని మంటలకు, ఎండు వరిదుబ్బుల్లో పచ్చగా పెరిగిన నాము పిలకలు మాడిపోయినై – చేల గట్లూ, నెర్రెల్లో దాక్కున్న బుర్రిపిట్టలూ, కలుగుల్లోని తాచుపాములూ భయంతో కంపించి, కుంచించుకుపోయినై.

❀

*(ప్రచురణ : 1940–49 మధ్య)*